క్లుప్తంగా

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా జిల్లా శంకర్



జిల్లా శంకర్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కనగల్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎన్నికైన కనగల్ మండల పరిధిలోని రేగట్టె గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జిల్లా శంకర్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన తన స్వగ్రామానికి రాగా.. తల్లిదండ్రులు శంకర్‌కు స్వీట్లు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన తనకు తగిన గౌరవం దక్కిందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునుగోడు: అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం మునుగోడు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన రమావత్ లాలీ మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఆటోలో నల్లగొండకు తరలిస్తుండగా విశ్వసనీయమైన వ్యక్తుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి దాదాపు 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీఎస్పీ నాయకులు

చండూరు: పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన మహిళా బిల్లుకు సంబంధించి 33శాతం రిజర్వేషన్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు అధిక సీట్లు కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎక్కువ సీట్లు దక్కేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ లింగయస్ మహారాజ్, శ్రీశైలం, సంధ్య, రాజేష్, సుమన్, మహేష్, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు హర్షణీయం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

నల్లగొండ టౌన్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) జిల్లా ఇన్‌చార్జిలు ఆదిమల్ల గోవర్ధన్, పంబాల అనిల్‌కుమార్ అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ... గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీమ్‌రావు, అంకెపాక శ్రీనివాస్, వంటపాక యాదగిరి, అనుముల సురేష్, గోసుకొండ కవిత, చాంద్‌పాషా, పెరిక అభిలాష్, చింత శివరామక్రిష్ణ, దున్న లింగస్వామి, నర్సింహ, కొండమ్మ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి



అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రధాన రహదారులకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు వెంటనే తొలగించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాల్లో ప్రజాప్రతినిధుల హస్తం ఉందని ఆరోపిస్తూ శనివారం మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి చేయడంతోనే అక్రమ కట్టడాలను తొలగించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేనా..?

- ఆవాస గ్రామాలకు దూరంగా పోలింగ్ బూత్‌లు
- సరైన రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక ఓటు హక్కుకు దూరంగా ప్రజలు



చీకటిమామిడి పరిధిలోని రాజీవ్‌నగర్ పోలింగ్ కేంద్రానికి వెళ్లే రోడ్డుకు అడ్డుగా ఉన్న ఇసుక వాగు

మునుగోడు: ఓటు హక్కును ఉపయోగించుకోవాలని ప్రభుత్వం అనేక రకాలుగా ప్రచారం చేస్తున్నా.. కొన్ని ఆవాస గ్రామాలకు దూరంగా పోలింగ్ కేంద్రాలని ఏర్పాటు చేయడంతో చాలామంది ఎన్నికల్లో ఓటు హక్కుని వినియోగించుకోలేకపోతున్నారు. అంతేకాక ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, రవాణా సౌకర్యాలు లేకపోవడంతో అనేక మంది ఓటు వేయలేక పోతున్నారు.

మండల వ్యాప్తంగా 44 పోలింగ్ కేంద్రాలు..

మునుగోడు మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలతో పాటు 17 ఆవాస గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 52వేల జనాభా నివాసముంటుండగా అందులో 35,437 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరు ఓటు హక్కు వినియోగించుకునేలా మండలంలో మొత్తం 44 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. అధిక ఓటర్లు ఉన్న గ్రామంలో నాలుగు నుంచి ఐదు పోలింగ్ కేంద్రాలు, 1000 కంటే తక్కువ ఓటర్లు ఉన్న గ్రామంలో ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు.

ఐదు ఆవాస గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు అవసరం..

మండల వ్యాప్తంగా 17 ఆవాస గ్రామాలు ఉంటే అందులో 12 గ్రామాల్లో 100 నుంచి 150లోపు మాత్రమే ఓటర్లు ఉన్నారు. మిగిలిన ఐదు ఆవాస గ్రామాల్లో దాదాపు 300కు పైగా ఓటర్లు ఉన్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాలు తమ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు 2 నుంచి 3 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్నాయి. ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యాలు కూడా లేవు. పులిపలుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని బీరేల్లిగూడెం, కల్వలపల్లి గ్రామ పంచాయతీలోని కాశవారిగూడెం, చీకటిమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్, చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని వంగూరిగూడెం, సింగారం గ్రామ పంచాయతీ పరిధిలోని నేరటోనిగూడెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పాఠశాల భవనాలు, ఇతర సౌకర్యాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా తమ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలని ఏర్పాటు చేసి తమ గ్రామంలోని ఓటర్లు అంతా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు, 17 ఆవాస గ్రామాలు ఉన్నాయి. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 44 పోలింగ్ కేంద్రాలని ఏర్పాటు చేశాం. అయితే నాలుగు, ఐదు ఆవాస గ్రామాల ప్రజలు తమ గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం మాకు ఇవ్వలేదు. కలెక్టర్ నుంచి ఆదేశాలు వస్తే ఏర్పాటు చేస్తాం.

– ఎం. నరేందర్, తహసీల్దార్, మునుగోడు

సరైన రోడ్డు లేదు



మా గ్రామంలోని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఎల్లలగూడెం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. అయితే ఆ పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు మా కాలనీ నుంచి సరైన రోడ్డు లేదు. అదీ కాకుండా వాగు అడ్డుగా ఉండటంతో వృద్ధులు, దివ్యాంగులు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. దాదాపు 330కి పైగా ఓటర్లు ఉన్న మా కాలనీలోని పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– శిరస్సు మల్లయ్య,రాజీవ్‌నగర్, చీకటిమామిడి

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



నకిరేకల్: రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: పట్టణంలోని తిప్పర్తి రోడ్డును రూ.2.70కోట్లతో విస్తరిస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం ఆయన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి మాట్లాడారు. నకిరేకల్ పట్టణంలోని ఇందిరాగాంధీ సెంటర్ నుంచి చీమలగడ్డ ఫ్లైఓవర్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీలు అందజేత..

నకిరేకల్ మండలంలోని కడపర్తికి చెందిన కడారి సొమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.4.50లక్షలు, ఒగోడు గ్రామానికి చెందిన శైలజకు రూ.2లక్షలు, తాటికల్‌కు చెందిన విజయ్‌కి రూ.30వేలు, రాజ్యంకు రూ.18వేలు, చందుపట్లకు చెందిన రవీందర్‌రెడ్డికి రూ.15వేలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన ఎల్‌ఓసీలను శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య లబ్ధిదారులకు అందజేశారు.

యాదవుల సంక్షేమానికి కృషి..

చిట్యాల: యాదవ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాలలో రూ.20లక్షలతో చేపట్టిన యాదవుల సంక్షేమ భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ భవన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, వైస్ చైర్మన్ మెండె సైదులు, కౌన్సిలర్లు రెముడాల లింగస్వామి, బెల్లి సత్తయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

కట్టంగూర్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంతటి రామకృష్ణ, యర్కల లక్ష్మణ్, చనగోని రవితేజ, అంతటి శివ, శ్రీకాంత్, సురేష్, తిరుమలేష్, బాలు, పోగుల రాజు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, బెల్లి సుధాకర్, అంతటి శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: మండలంలోని కొత్తపేటకి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉల్లెందుల యాదగిరి, ఊర వెంకన్న, చందుపట్ల యేసు, నారగోని సైదులు, బుడిగ సతీష్, సల్మాన్ ఉన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ బుర్రి యాదగిరిరెడ్డి, సర్పంచ్ బచ్చు జానకిరాములు, ఉప సర్పంచ్ తండు రాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన..

కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం రాత్రి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గోలి మంజులవేణుమాధవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, శివాలయ చైర్మన్ కానుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: పట్టణంలోని 41 వార్డులో మూడు కుటుంబాలకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా ఆర్థికసాయం అందించారు. 41వ వార్డుకు చెందిన పిన్నపురాళ్ల పుల్లయ్య అనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి పుల్లయ్య భౌతికకాయానికి నివాళులర్పించి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.20వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే వార్డులోని పద్మావతి కాలనీకి చెందిన రంగనాథ్ కుమారుడు మృతిచెందగా అతడి కుటుంబానికి రూ.10వేలు అందించారు. అదే విధంగా జంజిరాల సత్తయ్య పక్షవాతంతో బాధపడుతుండగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూలకంటి సైదిరెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు తదితరులు ఉన్నారు.

కనగల్‌లో..

కనగల్: మండల పరిధిలోని చెట్లచెన్నారం గ్రామానికి చెందిన కంబాలపల్లి రమేష్, కట్టవారిగూడెం గ్రామానికి చెందిన చింతల సూరయ్య మృతిచెందగా వారి కుటుంబాలకు శనివారం భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ మండల నాయకులు ద్వారా రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా శేరిలింగోటం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మేరెడ్డి నరేందర్‌రెడ్డి తండ్రి మేరెడ్డి గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా అతడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి, భిక్షంయాదవ్, బత్తుల ఉషయ్య, యూత్ అధ్యక్షుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, సర్పంచులు సుంకిరెడ్డి రమణారెడ్డి, బొగరి రాంబాబు, సైదిరెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 79 సవరించాలని వినతి

కట్టంగూర్: వ్యవసాయ కార్మికులకు ఇచ్చే కనీస వేతనానికి సంబంధించిన జీఓ 79ని సవరించి నూతన జీఓను తీసుకురావాలని శనివారం కట్టంగూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుకన్యకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 79 నేటికీ అమలవుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ జోఓను సవరించి నూతన జీఓను అమలు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ చినవెంకులు, నారి ఐలయ్య, మండల అధ్యక్షుడు ఇటికాల సురేందర్ పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి

నకిరేకల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి అన్నారు. నకిరేకల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ అండాలు, ఎంఈఓ నాగయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చండూరు(గట్టుప్పల్): మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో సోమవారం చండూరులో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని మహనీయుల పొలిటికల్ ఫ్రంట్ మునుగోడు నియోజకవర్గ చైర్మన్ మల్ల యాదయ్య పిలుపునిచ్చారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నారపాక అంజిమాదిగ, ప్రధాన కార్యదర్శి నెల్లికంటి రాఘవేంద్రయాదవ్, మాదగాని గోపాల్‌గౌడ్, చెరుకు సైదులు, మొద్దు కుమార్, ఖమ్మం గాలయ్య, పెద్దగాని శంకరయ్య, ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె చేస్తాం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

నల్లగొండ టౌన్: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి అన్నారు. నల్లగొండ పట్టణంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెండింగ్ బిల్లును చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, నాగమణి, విజయలక్ష్మి, చంద్రమౌళి, వినోద్‌కుమార్, అద్దంకి నర్సింహ, పోలె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చండూరులో భారీ ర్యాలీ..

చండూరు: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకున్న సందర్భంగా చండూరు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినాయకుడికి వినతి పత్రం అందజేశారు. ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనుంజయగౌడ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌ని పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అదనపు పనిభారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కేదారి, రమణమ్మ, నాగమణి, తారక, రాజేశ్వరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్వరక్ష డే



జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్‌లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ప్రజ్వల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వరక్ష డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ వై. చంద్రయ్య, ఐసీడీఎస్ ఏసీడీపీఓ వెంకటమ్మ మాట్లాడుతూ.. మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, సామాజిక వివక్ష వంటి అంశాలపై విద్యార్థిలకు అవగాహన కల్పించారు. సమాజ సేవలో భాగస్వాములవుతామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పారిజాత, సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ, హెచ్‌ఎం నర్సిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, పద్మ, సునీత, ధనలక్ష్మి, నాంగేంద్రమ్మ పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

కేతేపల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కేతేపల్లి మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. మండలంలో 16మంది సర్పంచులకు గాను కేవలం కేతేపల్లి చీకటిగూడెం గ్రామాల సర్పంచులు, 11 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను నలుగురు మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు. వీరిలో ఒక సర్పంచు, ఇద్దరు ఎంపీటీసీలు సమావేశం ప్రారంభమైన అర్ధగంటలోపే బయటకు వెళ్లిపోయారు. దీంతో మరో సర్పంచు, ఇద్దరు ఎంపీటీసీలతోనే అధికారులు సమావేశాన్ని కొనసాగించారు. అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలను చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వర్‌రావు మాత్రమే సమావేశంలో ప్రస్తావించారు. మిగతా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేనాథుడే లేకుండా పోయాడు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి సమావేశాన్ని పూర్తిచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, వైస్ ఎంపీపీ పెద్దబొక్క మాధవి, కోఆప్షన్ సభ్యుడు అవ్వారి శౌరయ్య, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ దివ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న సినీ నటి కరాటే కల్యాణి

నకిరేకల్: పట్టణంలో బయల్పడిన పురాతన గణపతి విగ్రహం వద్ద శివాలయానికి కేటాయించిన భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని వివిధ హిందూ సంఘాల రాష్ట్ర ప్రతినిదులు అన్నారు. శనివారం వారు పురాతన గణపయ్య విగ్రహాన్ని సందర్శించి విలేకరులతో మాట్లాడారు. శివాలయానికి 5.10 ఎకరాల భూమి ఉన్నట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉందన్నారు. ఇటీవల ఇక్కడ కంపచెట్ల మధ్యలో ఉన్న గణపతి విగ్రహం చుట్టూ స్థానికులు చదును చేసి తాత్కాలికంగా షెడ్డు వేసే ప్రయత్నం చేస్తే ఆ భూమి తమదని కొందరు షెడ్డును కూల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు ఇక్కడ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, ఎమ్మెల్యేని కూడా కలిసి విన్నవించామని తెలిపారు. సమావేశంలో సినీ నటి కరాటే కల్యాణి, హిందూ జన జాగృతి సమితి, హిందు సంఘటన్ ఏకతా మంచ్, రాష్ట్రీయ శివాజీ సేన, ధర్మవీర్ ఆధ్యాత్మిక చైతన్య వేదిక ప్రతినిధులు చేతన్, వినోద్, సునతని, శ్రీనివాసాచారి, కశ్యాప మహర్షి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు

నకిరేకల్ పట్టణంలో బయల్పడిన శ్రీలక్ష్మీగణపతి విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సినీ నటి కరాటే కళ్యాణితో పాటు పలువురు హిందు సంఘాల ప్రతినిధులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్ పర్సన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, కౌన్సిలర్ చెవుగోని రాములమ్మసైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

142 జీఓను రద్దు చేయాలి



జీఓ ప్రతిని చూపిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

నల్లగొండ టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో తీసుకొచ్చిన 142 జీఓను రద్దు చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 142 జీఓ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు నాలుగు వేల ఉద్యోగులను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. ఉద్యోగ సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమని అన్నారు. సమావేశంలో టీఎన్‌జీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగిళ్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు జె.శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అనురాధ, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ ఫోరం కార్యదర్శి నజీర్, యూసూఫ్, వెంకట్‌రెడ్డి, పద్మ, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో శనివారం ఓ అంగన్‌వాడీ ఆయా తన చంటిబిడ్డతో వచ్చి పాల్గొంది. -సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

గణపయ్యకు పూజలు

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం పలు మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కొన్ని చోట్ల గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు.



నల్లగొండలో మట్టి గణపతిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న డీఈఓ భిక్షపతి తదితరులు



కేతేపల్లి: కొప్పోలులో వినాయక పూజల్లో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి



నల్లగొండ టూటౌన్: మాన్యంచెల్కలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నల్లగొండలోని లయన్స్ క్లబ్ వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



నల్లగొండలోని శివాజీ నగర్‌లో పూజల్లో పాల్గొన్న బీజేపీ, బీసీ సంఘం నాయకులు



నల్లగొండలోని రవీంద్రనగర్‌లో మహాలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు



నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో గణేష్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు